సాక్షి కుమురం భీం

ఆదివారం । 30 । జూలై । 2023



పెట్రోల్ అరక..!

కెరమెరి మండలం సుల్తాన్‌గూడకు చెందిన శేక్ అయ్యూబ్ పనికి రాని మోటార్ సైకిల్, ఆటో పరికరాలతో పెట్రోల్‌తో నడిచే అరకను తయారు చేశాడు. 8లో▸



తగ్గని వరద ఉధృతి

మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంతో పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత, పెన్‌గంగ నదులు శనివారం ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.3 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సినారె జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఆకసం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఆసిఫాబాద్ కవుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు సినారె, డాక్టర్ వనపర్తి తిరుపతి సాహితి సేవలను కొనియాడారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు మాడుగుల నారాయణమూర్తి, నల్గొండ రమేశ్, రాధాకృష్ణచారి, మధుకర్‌శర్మ, వెంకట్రావ్, దేవరాజు, రేవతి, సత్యనారాయణ, శ్రీరాం, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



పెద్దవాగు పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని తుంపల్లి మోరంవాగులో ఇటీవల కురిసిన వర్షాలకు గల్లంతైన కౌశిక్, మోహన్‌ల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి స్థానిక బాలేశ్వర ఆలయం వద్ద గాలింపు చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దవాగు ద్వారా కాగజ్‌నగర్ వరకు గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు. వాగు పరీవాహక ప్రాంతాల్లోని అధికారులు గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గల్లంతైన వారిని కనుక్కోవడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రామ్మోహన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లోని పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈగలు, దోమలు వృద్ధిచెంది మలేరియా, డెంగీ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతిరోజు ఆశా కార్యకర్తలు డ్రైడే నిర్వహించాలన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని హెల్త్ ఇండికేటర్లలో జిల్లాను ముందుంచాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఈవో శ్యాంలాల్, వైద్యులు సుంకన్న, బండి రాజు, అశోక్, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ

వాంకిడి: పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అధికారులను హెచ్చరించారు. శనివారం ఇందాని, నవేగూడ గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. అనంతరం కొమురం భీం(అడ) ప్రాజెక్టును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందువల్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్, పీఆర్ ఏఈ స్టీవెన్, ఏపీవో శ్రావణ్‌కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

స్వచ్ఛత సాధించేలా..!



అడ పల్లె ప్రకృతి వనం

- పురస్కారాల బరిలో 15 పంచాయతీలు
- కేంద్ర అవార్డు గెలుచుకునేలా అధికారుల చర్యలు
- ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఆసిఫాబాద్‌అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 పురస్కారానికి జిల్లాలోని 15 గ్రామ పంచాయతీలో పోటీ పడుతున్నాయి. వివిధ అంశాలలో ప్రతిభ కనబర్చిన జీపీలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందజేయనుంది. జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 15 గ్రామాలను జనాభా ప్రాతిపదికన 3 విభాగాలుగా విభజించి ఎంపిక చేశారు. 5 వేల జనాభా ఉన్న 5 గ్రామాలు, 5 వేలలోపు జనాభా ఉన్న మరో 5 గ్రామాలు, 2 వేల నుండి 5 వేల వరకు జనాభా ఉన్న గ్రామాల జాబితాను రూపొందించారు.



రూపుదిద్దుకున్న అడ వైకుంఠధామం

సౌకర్యాలు మెరుగు పడేలా...

అవార్డుల కోసం పోటీపడే గ్రామాల్లో సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రధానంగా వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతల తవ్వకం, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, వీటి ద్వారా సేంద్రియ ఎరువు తయారీ, గోబర్ గ్యాస్, ప్లాస్టిక్ నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాలో పారిశుధ్య నిర్వహణలో పోటీతత్వం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారాలను అందించేందుకు ర్యాంకులను ప్రకటిస్తుంది. పురస్కారాల కోసం ఎంపికైన గ్రామాల్లో వివిధ అంశాలను పర్యవేక్షించేందుకు త్వరలోనే కేంద్ర బృందం వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ బృందం సభ్యులు గ్రామాలను పర్యవేక్షించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. ఉత్తమ పనితీరు కనబర్చిన పంచాయతీకి వెయ్యి మార్కులు వేస్తారు. వీటి ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటికి మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో పురస్కారాలు అందజేయనున్నారు.

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	గ్రామం
వాంకిడి	జైత్‌పూర్
జైనూర్	మార్లవాయి
జైనూర్	జంగాం
కాగజ్‌నగర్	ఈజ్‌గాం
కాగజ్‌నగర్	దుర్గానగర్
రెబ్బెన	కొండపల్లి, గోలేటి
ఆసిఫాబాద్	ఆసిఫాబాద్
కెరమెరి	కేస్లాగూడ,కెరమెరి,జరి
వాంకిడి	ఇందాని, వాంకిడి
ఆసిఫాబాద్	అడ
సిర్పూర్(టి)	వెంపల్లి

అవార్డు తప్పక సాధిస్తాం



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డును సాధించేందుకు అధికారులు మా గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. వారు సూచించిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి అవార్డు తీసుకునేందుకు పోటీపడుతున్నాం. అందరి సహకారంతో అవార్డు తప్పక సాధిస్తాం.

– లక్ష్మి, అడ, గ్రామ పంచాయతీ

సన్నద్ధం చేస్తున్నాం

స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పురస్కారాల కోసం ఎంపిక చేసిన గ్రామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. వందశాతం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర బృందం వచ్చేలోగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా సన్నద్ధం చేస్తున్నాం.

– సురేందర్, డీపీవో

కళ్ల 'కలక'లం



అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి కళ్లను పరీక్షిస్తున్న వైద్యాధికారి వినోద్‌కుమార్

- చిన్నారులు, విద్యార్థులపై వైరస్ ప్రభావం
- జిల్లాలో ఇప్పటికే 213 కేసులు
- హాస్టళ్లలో కొనసాగుతున్న పరీక్షలు

కెరమెరి మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరురోజుల క్రితం ఇద్దరు విద్యార్థులకు కళ్ల కలక వ్యాధి సోకింది. పరీక్షించిన పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌కుమార్ వైద్యం చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి పంపించారు. శనివారం అదే ఆశ్రమ పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించగా 11 మంది విద్యార్థులకు వైరస్ సోకినట్లు గుర్తించారు. దీంతో ఆ పాఠశాలలో కలకలం రేగింది. ఈ ఒక్క పాఠశాలనే కాదు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో విద్యార్థులు, చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): కళ్ల కలక (కంజెక్టివైటీస్) వ్యాధి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వ్యాపించింది. ముఖ్యంగా చిన్నారులకు అధికంగా సోకుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 213 కేసులు నమోదయ్యాయి. దగ్గు జలుబు, మాదిరి సీజనల్‌లాగా వచ్చే వ్యాధి. వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా ప్రభావం చూపుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వ్యాపించింది. ఎక్కువగా చిన్నారులు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధి సోకిన వారి కళ్లను తదేకంగా చూడడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే రోగిని ప్రత్యేక గదిలో ఉంచాలి. రోగి వాడిన టవల్, ఇతర వస్తువులు ఇతరులు ఉపయోగించకూడదు. పెద్ద ప్రమాదం ఏమీ లేకపోయినా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాధి లక్షణాలు

వ్యాధి సోకిన వారి కళ్లు మంట అనిపిస్తాయి. కళ్లవెంట నీరుకారడం, దురద, రెప్పలు వాపెక్కడం, ఊసులురావడం, నిద్రపోయిన సమయంలో రెప్పలు అతుక్కోవడం కళ్ల కలక లక్షణాలు. ఒక కన్నుతో మొదలై మరోకంటికి వ్యాపిస్తుంది. ఒకరితో మొదలై ఏకకాలంలో పలువురికి వ్యాప్తి చెందుతుంది. రోగనిరోధకశక్తి ఆధారంగా మూడు నుంచి వారం రోజుల పాటు వేధిస్తుంది. వాతావరణం ఒక్కసారిగా మారడంతో వ్యాధి ప్రభావం అధికంగా చూపుతోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యాధి సోకిన వారు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. రోగి టవల్, సబ్బు ఇతరులు వాడవద్దు. బయటికి వెళ్లినప్పుడు నల్ల కళ్లద్దాలు పెట్టుకోవాలి. ఇతరులకు దూరంగా ఉండాలి. విద్యార్థులకు సోకితే వ్యాధి తగ్గే వరకూ ఇంటివద్దే ఉండాలి. వైద్యుల సూచనలతో యాంటీబయాటిక్స్ డ్రాప్స్ వాడాలి.

ఆందోళన చెందవద్దు

కళ్ల కలక వ్యాధి సోకినవారు ఆందోళన చెందవద్దు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధికి సంబంధించిన డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయి. వ్యాధి సోకిన వ్యక్తి కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలి. రోగి కళ్లల్లోకి చూసినా అతను వాడిన టవల్ ఉపయోగించినా ఇతరులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

– రామకృష్ణ, జిల్లా వైద్యాధికారి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ డి.వేణు

సిర్పూర్(టి): అధికారులు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ డి.వేణు అన్నారు. భారీ వర్షాలకు నీటిలో మునిగిపోయిన పారిగాం వాగు వంతెనను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, నదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వరదనీటిలో మునిగిన వంతెనలపై ప్రయాణాలు సాగించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పారిగాం వాగు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.



పారిగాం వాగును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం

పెంచికల్‌పేట్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారం వైద్యసిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎల్లూర్ పల్లె దవాఖానాలను శనివారం తనిఖీ చేశారు. వైద్యసేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని ఆశా కార్యకర్తల ద్వారా సమాచారం సేకరించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పారిశుధ్యంపై గ్రామ పంచాయతీల్లో అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పీహెచ్‌ఎసీ వైద్యాధికారి నేహా తస్నీమ్, సీహెచ్‌వో ఇసాక్, హెచ్‌ఈవో కోటేశ్వర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ అనీసుద్దీన్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీడీఎంహెచ్‌వో

ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి

- పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి హన్మంతరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ప్రభావిత ప్రాంతాలలో పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి హన్మంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే, డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీలతో కలిసి జిల్లాలోని 15 మండలాల ప్రత్యేక అధికారులు, నీటిపారుదల, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, డ్యాంల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసుశాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అందవెల్లి పెద్దవాగు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి పెద్దవాగును పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు సందర్శించారు. ఆయన వెంట డీఎల్‌పీవో సురేశ్‌బాబు, ఎంపీడీవో గౌరీశంకర్, సర్పంచ్ గంగన్న, పంచాయతీ కార్యదర్శి ఆకాశ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు, పక్కన కలెక్టర్ హేమంత్ బోర్కడే

బాలాజీ వెంకన్నకు పూజలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామిని జిల్లా ప్రత్యేకాధికారి హనుమంతరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ప్రతిమ, జ్ఞాపికను అందజేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మండల ప్రత్యేకాధికారి రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ పందిర్ల వినోద, ఎంపీటీసీ హరిత, ఈవో బాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

చింతలమానెపల్లి: గ్రామాల్లో అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు అన్నారు. మండలంలోని కేతిని, దిందా, గూడెం గ్రామాల్లో పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట డీఆర్డీవో కుటుంబరావు, డీఎల్‌పీవో సురేశ్, తహసీల్దార్ మసూక్ర్ అలీ, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, కార్యదర్శులు సునీల్, ఇస్తారీ, తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూర్: వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయితీ రాజ్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ అన్నారు. రాబోయే రెండు రోజులు కూడా వర్షసూచన ఉండడంతో వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితులపై ప్రజల సౌకర్యార్థం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి సహాయం కోసమైనా ప్రజలు కంట్రోల్ రూం 304686505 నంబరులో సంప్రదించాలని సూచించారు. అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి బిహార్ వాసి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని లేతన్‌గూడ రైల్వేగేట్ సమీపంలో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని రైలు నుంచి కిందపడి బీహార్‌కు చెందిన చుల్ హాయ్ పాస్వాల్ (62) మృతి చెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో కూరగాయలు విక్రయించుకుంటూ జీవించే పాస్వాల్ సొంత ఊరికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలోని రెబ్బెన మండలం లేతన్‌గూడ వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి మృతిచెందాడు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ నెల 30, 31, ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల వివిధ పేపర్లు, పీజీ కోర్సులకు నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొల్లూర్ గోదావరి నది ప్రవాహంలో గుర్తు తెలియన మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బురదలో చిక్కుకున్న తహసీల్దార్ కారు



రాంనగర్‌లోని బురదలో చిక్కుకున్న కారు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్‌లోకి వచ్చిన వరదనీరు ఇళ్ల మధ్యలోకి చేరడంతో ఆ ప్రాంతం మొత్తం బురదగా మారింది. ఆయా ప్రాంతాలను పరిశీలించేందుకు తహసీల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌లో తహసీల్దార్ కారులో బయలు దేరారు. తిరుగు ప్రయాణంలో వారి కారు రోడ్డు పక్కనే ఉన్న బురదలో ఇరుక్కుపోయింది. ఆ వాహనాన్ని బయటకు తీసేందుకు గంటన్నరకు పైగా ప్రయత్నించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వరద వల్ల ఎంత మేర బురద కాలనీలోకి వచ్చి చేరిందో అర్థమవుతోంది.

పెట్రోల్ అరక..!



పెట్రోల్ అరకతో గడ్డి తొలగిస్తున్న శేక్ అయ్యూబ్

- బైక్, ఆటో పరికరాలతో తయారీ
- ఎకరాకు లీటరు పెట్రోల్ చాలు
- కెరమెరి యువకుడి వినూత్న ఆలోచన

కెరమెరి(ఆసిఫాబాద్): పంట చేలలో అరక దున్నాలంటే ఎడ్లు ఉండాలి. రైతు కూడా అవసరమే. ఎడ్ల సంఖ్య తగ్గి ప్రస్తుతం అరక దున్నాలంటే ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం సుల్తాన్‌గూడకు చెందిన శేక్ అయ్యూబ్ వినూత్న ఆలోచనతో పెట్రోల్ అరక రూపొందించాడు. మూడు మాసాల శ్రమతో పెట్రోల్‌తో నడిచే అరక సిద్ధమైంది. పనికి రాని మోటార్‌సైకిల్, ఆటో పరికరాలతో పెట్రోల్‌తో నడిచే అరకను తయారు చేశాడు. మోటార్ బైక్‌లాగానే దీన్ని నడపవచ్చు. చేతుల్లోనే ఎక్స్‌లేటర్, క్లచ్, గేర్లు ఉంటాయి. కిక్ కొడితే స్టార్ట్ అవుతుంది. నాలుగు గేర్లు ఉండడంతో హైస్పీడ్‌లో కూడా దున్నవచ్చు. ఛేసిస్, ఇంజన్, నాలుగు గేర్లు, ఎక్స్‌లేటర్, క్లచ్ షాఫ్ట్ మోటార్ బైక్‌కు సంబంధించినవి కాగా.. టైర్లు ఆటోకు సంబంధించినవి. గాలిలో పొగ వెళ్లేందుకు సైలెన్సర్ బిగించాడు. ఈ పెట్రోల్ అరక తయారీ రూ.40 వేలు ఖర్చు చేశాడు. పొలంలో అరక పడుతూ గడ్డిని తొలగిస్తున్నాడు. వాస్తవంగా ఒక ఎకరం దున్నడానికి(గడ్డిని తొలగించేందుకు) రైతులు ప్రస్తుతం రూ.1500 చెల్లిస్తుండగా.. ఈ పెట్రోల్ అరకకు ఒక లీటరు పెట్రోల్ సరిపోతుంది. ఒక ఎకరాన్ని మూడు గంటల్లో దున్నవచ్చు. దీనికయ్యే ఖర్చు రూ.110 మాత్రమే. అంటే ఈ యంత్రంవల్ల ఒక రైతు ఎకరానికి రూ.1390 ఆదా చేయవచ్చు.

శ్రమ ఫలించింది.

అరకలకు రూ.వేలు ఖర్చు పెడుతున్నాం. వ్యవసాయానికి ఖర్చు తడిసి మోపడవుతోంది. దీంతో ఖర్చు తగ్గించేందుకు వినూత్న ఆలోచన చేశారు. మూడు మాసాలుగా సుదీర్ఘంగా ఆలోచించి వారం రోజుల క్రితం దీన్ని తయారు చేశాను. నేను పడ్డ శ్రమ ఫలించింది, అరక ఎడ్లు, కూలీ మనిషి లేకుండా ఎంచక్క ఈ పెట్రోల్ వాహనంతో పొలంలో అరక పడుతున్నా. సుమారు రూ.40 వేలు ఖర్చు అయింది. – **శేక్ అయ్యూబ్, సుల్తాన్‌గూడ**

మూడవ రోజు రాకపోకలు బంద్

- రెండు అంతర్రాష్ట్ర రహదారుల్లో నిలిచిపోయిన రాకపోకలు
- మూడు మండలాలకు సైతం..
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



మునిగిన పారిగాం వంతెన



హుడ్కిలి లోలెవల్ వంతెన వద్ద వరదలో మునిగిపోయిన లోలెవల్ వంతెన

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు మూడు రోజులుగా మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండలం మీదుగా ఉన్న సిరూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల గుండా మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్ర గ్రామాలకు, పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ప్రతీ రోజు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్, తహసీల్దార్ రియాజ్ అలీల ఆధ్వర్యంలో పెన్‌గంగపై ఉన్న వంతెన హుడ్కిలి లోలెవల్ వంతెనలపై భారీ బందోబస్తును ఏర్పాటు చేసి ప్రమాదకర ప్రయాణాలు సాగించకుండా రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.

సిర్పూర్(టి)–కౌటాల, చింతలమానెపల్లి మండలాలకు...

భారీ వర్షాలకు సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారి గుండా రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని పారిగాం గ్రామం వద్ద ఉన్న వాగుపై ఉన్న వంతెన పూర్తిగా వరదనీటిలో మునిగిపోవడంతో ఈ రహదారి గుండా ప్రయాణాలు నిలిచిపోయాయి. దీంతో సిర్పూర్(టి) మండలంలోని పారిగాం, లోనవెల్లి, కర్జపల్లి, కంచర్‌పేట్, కోనేరు కాలనీ, డోర్‌పల్లి గ్రామాలతో పాటు కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి గుండా ప్రమాదకర ప్రయాణాలు సాగించకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు.

మార్లావాయిని సందర్శించిన డిప్యూటీ కమిషనర్



పద్మశ్రీ కనక రాజుతో ముచ్చటిస్తున్న జాన్‌వెస్లీ

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామాన్ని శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ జాన్‌వెస్లీ సందర్శించారు. ఆదివాసీ ఆత్మబంధువు ప్రొఫెసర్ హైమాన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ విగ్రహాలకు నివాళి అర్పించారు. వారి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వీధుల గుండా పర్యటిస్తూ పచ్చదనం, పరిశుభ్రత పనులను పరిశీలించారు. పద్మశ్రీ కనక రాజు ఇంటిని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు డార్ఫ్ రాసిన నివేదిక పుస్తకాలు బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర కలిగిన గ్రామాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్ రావు, గ్రామస్తులు జుగ్నాక ధర్మేందర్, కనక కోద్దు, మండాడి లింగు, కనక యాదవ్‌రావు, ఎంపీడీవో ప్రభుదయ, ఏపీవో నగేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మనోజ్ కూమార్ పాల్గొన్నారు.

మీడియా సంస్థలపై నిషేధం వెనక్కి తీసుకోవాలి



బచ్చలి ప్రవీణ్‌కుమార్

పాతమంచిర్యాల: మీడియా సంస్థలపై నిషేధం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన డీఈవోల సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలను విద్యా సంస్థల్లోకి రానివ్వద్దని ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు బయట పడకుండా ఉండేందుకు ప్రభుత్వం డీఈవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టమవుతుందన్నారు. విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించకుండా మన ఊరు మన బడి పేరుతో రూ.7200 కోట్లు కేటాయించి రూ.400కోట్ల పై చిలుకు నిధులు ఖర్చు పెట్టడమే ప్రభుత్వ విద్యపై పాలకుల చిత్తశుద్ధి కనిపిస్తుందన్నారు.

అధికలోడు.. మితిమీరిన వేగం



బొగ్గు లోడుతో వెళ్తున్న టిప్పర్

మందమర్రిరూరల్: సింగరేణి గనుల్లో నుంచి వెలికితీసిన బొగ్గును టిప్పర్లలో ఇష్టానుసారంగా నింపుకుని రహదారిపై అత్యంత వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ప్రతిరోజు వందలాది టిప్పర్లు ఆయా గనుల నుంచి బొగ్గు లోడ్‌తో మందమర్రి కోల్‌బెల్ట్ రహదారిపై రామకృష్ణాపూర్ సీఎస్పీ వరకు రవాణా చేస్తాయి. బొగ్గు లోడ్ చేసేటప్పుడు టిప్పర్‌లో బాడీ లెవల్‌గా నింపి తర్వాత రవాణ చేస్తున్నప్పుడు బొగ్గు పెళ్లలు జారిపడకుండా కవర్లు కప్పాలి. కానీ నిత్యం వందలాది లారీల్లో నిబంధనలు పాటించకుండా బొగ్గు రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

లక్ష్మీపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

- చెన్నూర్ వ్యాపారికి తీవ్ర గాయాలు

కోటపల్లి: మండలంలోని జాతీయ రహదారి లక్ష్మీపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో చెన్నూర్ పట్టణానికి చెందిన వ్యాపారి నవీన్ గయోత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూర్ పట్టణానికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం సిరోంచకు వెళ్లి చెన్నూర్‌కు వస్తుండగా లక్ష్మీపూర్ గ్రామానికి సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే పనిలో ఉన్నామని ఎస్సై సురేశ్ తెలిపారు. లక్ష్మీపూర్‌లోని జాతీయ రహదారిపై పక్కనే అక్రమంగా వెలిసిన బెల్ట్‌షాపులో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారులోని వారు మద్యం సేవించినట్లు సమాచారం.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మనందం మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు ఏమాత్రం తీసిపోకుండా కాంట్రాక్ట్ కార్మికులు అన్ని పనులు చేస్తున్నారని, అయితే వారికి కనీస సౌకర్యాల కల్పనలో యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. జేబీసీసీఐలో జరిగిన అగ్రిమెంట్లను కోలిండియాలో అమలుచేస్తుండగా సింగరేణిలో మాత్రం అమలుచేయటం లేదన్నారు. సమానపనికి సమాన వేతనాలు చెల్లించడంతో పాటు లాభాలలో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేష్, ముత్యాల వెంకటేష్, శంకర్, నిరంజన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత

వేమనపల్లి: ఎగువన ఉన్న ప్రాణహిత ఉప నదుల నుంచి వరద తాకిడి పెరగడంతో ప్రాణహిత నదిలో వరద ఉధృతి పెరుగుతోంది. దీనికి తోడు దిగువన గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో వరద నీరు కిందికి వెళ్లలేకపోతోంది. దీంతో ప్రాణహిత పుష్కరఘాట్, రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. ముల్కలపేట, రాచర్ల మధ్యన నిర్మాణంలో ఉన్న బొందచేను ఒర్రె వంతెన పై నుంచి వరద ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. రాచర్లతో పాటు కోటపల్లి మండలం నుంచి వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. స్థానిక జాలర్లు నాటుపడవలు ఏర్పాటు చేసిన వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని అధికారులు నాటుపడవల ప్రయాణాన్ని నిలిపివేశారు. బ్యాక్ వాటర్‌తో వందల ఎకరాల్లో పంట మొలక దశలోనే వరదపాలైంది.

పదహారేళ్లకు తల్లి చెంతకు తనయుడు



తల్లి, బాబాయ్, పిన్నీతో మహేందర్ బింద్

బెల్లంపల్లి: పద్నాలుగేళ్ల వయస్సులో తప్పిపోయిన బాలుడు పదహారేళ్ల తర్వాత తల్లి చెంతకు చేరాడు. చిన్నతనంలోనే దూరమైన కొడుకు ఇక తమకు దొరకడేమోనని నిత్యం కన్నీటి పర్యంతమైన ఆ తల్లికి ఎదిగిన కొడుకు దరిచేరడంతో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజీపూర్ జిల్లా మహ్మదాబాద్ తహసీల్ పరిధిలోని యూసుఫ్‌పూర్ గ్రామానికి చెందిన సంత్రదేవి, మున్నాకుమార్ బింద్ దంపతులకు నలుగురు కుమారులు, కూతురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు మహేందర్ బింద్ అలియాస్ మనోజ్‌ను చిన్నతనంలో దగ్గరి బంధువు ముంబయి తీసుకెళ్లి హోటల్‌లో పనికి కుదిర్చాడు. కొద్ది రోజుల తర్వాత హోటల్‌లో పని మానేసి వెళ్లిపోయాడు. ఆ క్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివ్‌కుమార్ యాదవ్ అనే యువకుడికి తారసపడ్డాడు. తనదీ అదే రాష్ట్రమని, పని కోసం వెతుకుతున్నానని మహేందర్ బింద్ చెప్పడంతో వెంట తీసుకొచ్చి బెల్లంపల్లిలోని బేకరీలో పనికి కుదిర్చాడు. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తుండగా ఓ రోజు ఇంటిపై ధ్యాస మళ్లి బేకరీ యజమాని సుశీల్‌కుమార్ యాదవ్‌కు తన ఇంటి అడ్రస్ కనుక్కోవాలని కోరాడు. దీంతో సుశీల్‌కుమార్ ఆ రాష్ట్రంలోని తన బంధువులకు చెప్పి ఆరా తీశాడు. ఘజీపూర్ జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యూసుఫ్‌పూర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వివరాలు ఇచ్చారు. దీంతో తల్లి సంత్రదేవి, బాబాయ్ కమలేష్‌బింద్, పిన్నీ బసంత్ బింద్ శుక్రవారం బెల్లంపల్లికి చేరుకున్నారు.

ఆపరేషన్ చేసిన గాయం చూసి...

కొడుకును వెతుక్కుంటూ రాష్ట్రాలు దాటొచ్చిన తల్లి అతడిని చూసి ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురైంది. కొడుకూ కన్నీటి పర్యంతమయ్యాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నతనంలో గొంతుకింద చేసిన ఆపరేషన్ గాయాన్ని పరిశీలించి మహేందర్ బింద్ తన కొడుకేనని సంత్రదేవి మురిసిపోయి ముద్దాడింది. కుటుంబసభ్యులను కలిసేలా చేసిన బేకరీ షాప్ యజమాని సుశీల్ కుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహేందర్ బింద్ తల్లి, బంధువులతో కలిసి రైలులో ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరి వెళ్లాడు.

భారీ వర్షాలకు ప్రజలు చస్తుంటే..

- ప్రగతిభవన్‌లో కేసీఆర్ రాజకీయాలు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు చస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లలో రాజకీయాలు చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల లేనిదే మంత్రులు, అధికార యంత్రాంగం బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉందన్నారు. బెజ్జూర్ ఇన్‌చార్జి సర్పంచ్ 6 లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేసి రూ.12 లక్షల నిధులు డ్రా చేశారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిర్పూర్‌లో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మణిపూర్ మారణహోమాలపై ప్రధాని నోరు విప్పాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి బీఎస్పీ నాయకులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్, పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్, నాయకులు గణేశ్, విజయ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విరిసిన విద్యా కుసుమాలు



విద్యార్థులను అభినందిస్తున్న కౌన్సిలర్ మేకల దాసు

- కార్మిక వాడల నుంచి కాన్పూర్ ఐఐటీకి..
- సెంట్రల్ యూనివర్సిటీలోనూ సీటు

శ్రీరాంపూర్: విరిసిన విద్యాకుసుమాలు సింగరేణి కార్మిక ప్రాంతానికి పేరుతెచ్చాయి. శ్రీరాంపూర్ కార్మికవాడలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో సీట్లు సాధించి శభాష్ అనిపించారు. శ్రీరాంపూర్‌లోని 17వ వార్డు హిమ్మత్‌నగర్‌కు చెందిన బోయ రమేశ్, వసంత దంపతుల కుమారుడు అనుదీప్ కాన్పూర్‌లోని ఐఐటీలో సీటు సాధించాడు. ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్ మొదటి రౌండ్‌లోనే బయోటెక్నాలజీ కోర్సులో సీటు లభించింది. బీటెక్ పూర్తి చేసిన తరువాత పరిశోధన వైపు వెళ్లి శాస్త్రవేత్తను అవుతానని అనుదీప్ తెలిపాడు. ఇదే ప్రాంతానికి చెందిన చింతన నర్సింగం, లత దంపతుల కూతురు సిరి సెంట్రల్ యూనివర్సిటీ బిలాస్‌పూర్ కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో సీటు సాధించింది. సివిల్స్ రాసి ఐఏఎస్‌ను అవుతానని సిరి పేర్కొంది. విద్యార్థులను స్థానిక కౌన్సిలర్ మేకల దాసు శనివారం తన కార్యాలయంలో అభినందించారు. మరింత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు. గాదాసి రాజు, శ్రీనివాస్, నరేశ్, దాసరి సురేశ్ పాల్గొన్నారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు..

- ఆందోళనకు దిగిన వాహనదారులు



బాటిల్‌లో నీరు చూపిస్తున్న దృశ్యం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్ల రావడంతో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... వాహనదారులు శనివారం హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తమ వాహనాల్లో పెట్రోల్ పోసుకొని కొంత దూరం వెళ్లగానే వాహనాలు ఆగిపోయాయి. దీంతో మెకానిక్‌లను సంప్రదించగా ఇంజన్‌లోకి పెట్రోల్‌కు బదులుగా నీళ్లు చేరాయని తెలిపారు. వాహనంలోని పెట్రోల్‌ను తీసి పరిశీలించగా నీరు ఉండడంతో కల్తీ జరిగినట్లు గుర్తించారు. పెట్రోల్‌ను బాటిల్లో తీసుకుని వాహనదారులు వందల సంఖ్యలో బంక్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో బ్లూ కోర్ట్ సిబ్బంది జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమనిగించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది మా తప్పిదం ఏమి లేదని ట్యాంకర్ వచ్చి బంక్‌లో పెట్రోల్ పోసి వెళ్లిపోయిందని తెలుపడం గమనార్హం. మరి పెట్రోల్ కల్తీ ఎక్కడ జరిగిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. జరిగిన పొరపాటుకు వాహనదారుల బండి నంబర్లు ఫోన్ నంబర్ రాసుకుని మళ్లీ ఎంత పెట్రోల్ పోయించుకున్నారో అంత పోసేందుకు ఒప్పందం చేసుకోవడంతో ఆందోళన సద్దుమనిగింది.

ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు మాట్లాడుతూ ఆర్‌వోబీ నిర్మాణానికి 2013లో నిధులు మంజూరైనా ఇప్పటివరకు పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. రైల్వేగేటు వల్ల అత్యవసర పనుల నిమిత్తం మంచిర్యాల వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా వేసిన రోడ్డు పూర్తిగా బురదమయమై ప్రజలు నానా ఇక్కట్ల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్‌వోబీ పనులు పూర్తి చేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మేకల శ్రీనివాస్, మెట్ట సుధాకర్, కొట్టేరాజయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.